
హైదరాబాద్ వార్త



# అన్నం పెట్టిన ఇంటికే కన్నం

**నమ్మకంగా ఉంటూ.. నట్టేట ముంచుతున్నారు**
**అదను చూసి అందినకాడిని దోపిడీ**
**దొంగతనాలకు పాల్పడుతున్న డ్రైవర్లు, పనిమనుషులు**
**యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు**



హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త: అన్నంపెట్టిన ఇళ్ళకే కన్నం వేస్తున్నారు. నమ్మకంగా ఉంటూ నట్టేట ముంచుతున్నారు. అదును చూసి అందినకాడానిక దోచుకుపోతున్నారు. సరిగానగ మూడునెలల క్రితం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.7కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారైన డ్రైవర్ ఉదంతం మరవక ముందే తాజాగా జూబ్లీహిల్స్‌లో అచ్చం అలాంటి సంఘటనే వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన బానోత్ సాయికుమార్ మాదాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్ 36లోని ఆదిత్రి హౌజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మూడేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటుండటంతో ఆతడితో ఆర్థిక కార్యకలాపాలు చేయించుకునేవారు. అతడూ వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇన్నిరోజులుగా పనిచేస్తూవచ్చాడు. అయితే పెద్దమొత్తంలో డబ్బు చూస్తుండటంతో అతడిమందిలో పాడు ఆలోచన మొదలైంది. అంతే పథకం రచించి సమయం కోసం వేచి చూస్తున్నాడు. ఈక్రమంలోనే ఈనెల 24న ఉదయం సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు రూ.1.2 కోట్లను జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఇవ్వాల్సిందిగా డ్రైవర్ బానోత్ సాయికుమార్‌కు సూచించారు. దాంతో సాయికుమార్ సంస్థ వాహనంలో శ్రీనివాస్ రావు ఇచ్చిన డబ్బుతో ఆఫీస్ నుంచి బయలుదేరాడు. తన ప్లాన్ అమలు చేయడానికి ఇదే సరైన సమయం అని భావించి డబ్బుతో పరారయ్యేందుకు నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని కళాంజలి సమీపంలోకి వెళ్లగానే కారును అక్కడే వదిలేసి డబ్బుతో పరారయ్యాడు. ఆఫీస్ నుంచి బయలు దేరి చాలా సమయం అవుతున్నా.. డబ్బు ఇంట్లో ఇవ్వకపోవడంతో శ్రీనివాస్‌రావుకు అనుమానం మొదలైంది. ఎందుకైనా మంచిదని ఓసారి డ్రైవర్‌కు ఫోన్ చేశాడు. అవతలి వ్యక్తి నుంచి నోరెస్పాన్స్. మళ్ళీ చేశాడు. ఈసారి" మీరు కాల్ చేస్తున్న నంబర్ అందుబాటులో లేదు లేదా స్విచ్చాఫ్ చేయబడి ఉంది" అని సమాధానం వచ్చింది. వెంటనే విషయాన్ని ఏజీఎం దృష్టికి తీసుకెళ్లగా ..అదే రోజు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సిసి పుటేజీల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో సాయికుమార్‌ను అందుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఇటీవల నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ఉత్తరాధి రాష్ట్రాలతో పాటు నేపాల్ వంటి ప్రాంతాల నుంచి ఇక్కడి వలస వచ్చి ఇంట్లో పనికి చేరి దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటలు ఇటీవల వరసగా పాల్పడుతున్నాయి. ఈనేపథ్యంలో ఇంట్లో డ్రైవర్, పనిమనుషలను పెట్టుకునేటప్పుడు ఒకటికి రెండుసార్లు వారి గురించి తెలుసుకుని వారి పూర్తిచిరునామా , కుటుంబనేపథ్యంలో చూసి చేర్చుకోవాలని లేకుంటే ఇలాంటి ఘటనలు మరిన్ని జరిగే అవకాశం ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## నేత్రపర్వం నవరసభరితం భక్తి, నృత్య, గీత స్వరార్చన



భక్తి, నృత్య, గీత స్వరార్చనలో చిన్నారుల అద్భుత నేత్రపర్వ ప్రదర్శన

రవీంద్రభారతి, మే 29 ప్రభాతవార్త : శ్రీ లక్ష్మీనరసింహస్వామి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆల్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నిర్వాహక సంస్థల అధ్యక్షులు నరహరి మణికంఠ, అపర్ణ దీపికల నేతృత్వంలో భక్తి, నృత్య, గీత స్వరార్చన నేత్రపర్వం, నవసరభరితంగా సాగాయి. నాలుగు గంటలపాటు నిర్విరామంగా జరిగిన ఈ ప్రదర్శనల్లో 150మందికిపైగా చిన్నారి, యువకళాకారులు, 9మంది గురువులు తమ అద్భుత కళాప్రతిభను చాటుతూ 27 సంకీర్తనలు, వివిధ అంశాలతో 6 నృత్యాలను అత్యంత వైభవంగా ప్రదర్శించి విచ్చేసి అశేష ప్రేక్షకులు, కళాప్రియులను తన్మయుల్నిచేసి మంత్రముగ్ధులను కావించారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు చిన్నారులు, యువకుల్లోని సృజనాత్మక శక్తి, ప్రతిభాపాటవాలను వెలికితీసి మరింతగా ప్రోత్సహించి చైతన్యవంతులను చేయడానికి ఎంతగానో ఉపకరిస్తాయని నిర్వాహకులు మణికంఠ, అపర్ణలను, కళాకారుల తల్లిదండ్రులను అభినందించారు.

## పవన్‌కల్యాణ్ షూటింగ్ సెట్‌లో అగ్నిప్రమాదం



మంటలను అర్పుతున్న ఫైర్‌సిబ్బందది

దుండిగల్, మే 29 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట పరిధిలో పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ సినిమా కోసం వేసిన షూటింగ్ సెట్‌లో అర్ధరాత్రి స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గండిమైసమ్మ మియాపూర్ రహాదారిలోని హామారా దాబా ఎదురుగా కొన్ని నెలల కిందట పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ సినిమా షూటింగ్ కోసం సెట్ వేశారు. షూటింగ్ అయిపోవడంతో సోమవారం సెట్‌ను అక్కడి నుండి తొలగించే క్రమంలో గ్యాస్‌కట్టర్‌లతో ఇనుపపైపులను కట్‌చేస్తుండగా నిప్పురవ్వలు థర్మకోల్ షీట్లపై పడడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈప్రమాదంలో కూలీలు ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. స్వల్పంగా ఆస్థినష్టం సంభవించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈమేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పొగ భగ!

- ఒకవైపు మండిపోతున్న ఎండలు
- మరోవైపు దుమ్మురేపుతున్న కాలుష్యం
- నగర ప్రధాన కూడళ్లలో ఉక్కిరిబిక్కిరి

**ఒకవైపు 41 డిగ్రీలకు చేరువైన పగటి ఉష్ణోగ్రతలు..మరోవైపు ఊపిరిసలపని రీతిలో శ్వాసకోశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంతో నగరవాసులు విలవిల్లాడుతున్నారు. వాహనాల నుంచి వెలువడుతున్న పొగలోని సూక్ష్మ, స్థూల ధూళి కణాలు నేరుగా శ్వాసకోశాల్లోకి వెళుతున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళ ఇంటి నుంచి బయటకు వెళ్లినవారిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం పొంది ఉంది. పిసిబి నిబంధనల ప్రకారం ప్రతి ఘనపు మీటరు గాలిలో ధూళికణాలు 60 మైక్రోగ్రాములు మించరాదు. కానీ నగరంలో పలు కూడళ్ల వద్ద 90-105 మైక్రో గ్రాముల మేర వాయు కాలుష్యం నమోదవుతుండడం గమనార్హం.**

హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త : గ్రేటర్ పరిధిలో సుమారు 70 లక్షలకు పైగా ఉన్న వాహనాలు వెదజల్లుతున్న పొగ, ట్రాఫిక్ రద్దీతో రహదారులపై రేగుతున్న దుమ్ముతో సిటీజన్ల ముక్కుపుటాలు, శ్వాసకోశాలు దెబ్బతింటున్నాయి. బోడుప్పల్ వంటి మున్సిపల్ కార్పొరేషన్లలోని పలుచోట్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగులబెట్టడంతో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో సమీప ప్రాంతాలు పొగచూరుతున్నాయి. శివారు ప్రాంతాల్లో నిర్మాణ సంబంధ కార్యకలాపాలు పెరగడంతో సూక్ష్మ ధూళికణాలు పీల్చే గాలిలో చేరి ఊపిరితిత్తుల్లోకి వెళుతున్నాయి. మేడిపల్లి-ఉప్పల్ వరంగల్ రోడ్, అంబర్‌పేట, గోల్నాక, నాచారం, బాలానగర్, జూబ్లీహిల్స్, పాతబస్తీ చార్మినార్, ప్యారడైజ్, జూపార్క్, పంజాగుట్ట, కూకట్‌పల్లి కూడళ్లలో వాయు కాలుష్యంతో పాటు దుమ్ము ధూళి శృతిమించుతోంది. పలు కూడళ్లలో ఏడాదికి సగం రోజులు అంటే 183 రోజుల పాటు కాలుష్య మేఘాలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు బయటపడడం గమనార్హం. గ్రేటర్ పరిధిలో కాలం చెల్లిన వాహనాలు 15 లక్షల వరకు ఉన్నాయి. ఇవన్నీ రోడ్లను ముంచెత్తుతుండడంతో పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**ధూళి రేణువులు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో**
**శ్వాస కోశ వ్యాధులు : డాక్టర్ ధనుంజయ, బాగ్‌అంబర్‌పేట**

సూక్ష్మ, స్థూల ధూళి రేణువులు పీల్చే గాలిలో చేరి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో తీవ్రమైన శ్వాస కోశ వ్యాధులు, పొడి దగ్గు, బ్రాంకైటీస్‌కు కారణమవుతున్నాయి. దుమ్ము ధూళి కళ్లలోకి చేరి రెటీనా దెబ్బతింటుంది. చికాకు, అసహనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతోంది. తలనొప్పి, పార్శ్యపు నొప్పికి దారి తీస్తోంది. ధూళి కాలుష్య మోతాదు క్రమంగా పెరుగుతుంటే ఊపిరితిత్తుల కేర్సర్లు పెరిగే ప్రమాదం పొంచి ఉంది.ఇటీవల నగరంలో శ్వాసకోశ సమస్యలు, అస్తమా, క్రానిక్ బ్రాంకైటిస్, సైనస్ సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం వాతావరణ మార్పులు, వాయు కాలుష్యమే.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న దిశ పటానీ

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి తలసాని



కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట, మే 29 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ చెక్కులను మంత్రి తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు అమలౌతున్నాయన్నారు. పేదింటి ఆడపడుచు పెళ్లికి 1 లక్ష 116 అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పోరేటర్ హేమలత, సికింద్రాబాద్ తహశీల్దార్ శైలజా, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గజ వాహానంపై వైకుంఠవాసుడి వైభోగం

**ఘనంగా పురవీధుల్లో పద్మావతి గోదాదేవి, శ్రీవారి ఊరేగింపు**

సైఫాబాద్, మే 29 ప్రభాతవార్త: లిబర్టి వద్దగల తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం తిరునిలయంలో శ్రీవారికి 'శాంతి కళ్యాణం' మహోత్సవం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి మేళాల మధ్య శాంతి కళ్యాణం వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయంలో శ్రీవారికి సుప్రభాత సేవ మొదలు ఏకాంత సేవలు వరకు అన్ని సేవలు భక్తి శ్రద్దలతో ఆగమోక్తంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు గరుడ వాహానంపై శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు గజ వాహానంపై పురవీధుల్లో అత్యంత వైభవంగా జరగగా, రాత్రి 8 గంటలకు గరుడ వాహానంపై పురవీధుల్లో శ్రీవారి ఊరేగింపు కొనసాగింది. ఈ ఊరేగింపులో హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, వందలాది మంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేలాది మంది భక్తులకు, సిబ్బందికి ఉదయం అల్పహారం, మద్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ జరిగింది.

**నేడు రథోత్సవం, అశ్వవాహానంపై శ్రీవారి ఊరేగింపు**

దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 30వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు అశ్వ వాహానంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో ఘనంగా జరగనుంది. ఈ నెల 31వ తేదీ బుధవారంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉదయం మహా పూర్ణాహుతి, చక్ర స్నానం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి పుష్పయాగం, 9 గంటలకు ధ్వజావరోహణం జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



పుర వీధుల్లో గజ వాహానంపై శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు

## రానున్న ఎన్నికల్లో బిజెపిని బలపరిచి కెసిఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలి: విజయశాంతి



కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో జరిగిన బిజెపి ఓబిసి మోర్చా మహాధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ పార్లమెంట్‌బోర్డు సభ్యురాలు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతి, చిత్రంలో శ్రీశైలంగౌడ్, బిజెపి ఓబిసి మోర్చా తెలంగాణ ఆలె బాస్కర్, నందనం దివాకర్, డాక్టర్.ఎస్.మల్లారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్, మే 29 ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి స్వార్థ ప్రయోజనాలకు రాష్ట్రాన్ని తాకట్టుపెడుతున్న కెసిఆర్ ప్రభుతానికి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ పార్లమెంట్ బోర్డు సభ్యురాలు, జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతి పిలుపునిచ్చారు. సోమవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో బిజెపి ఓబిసి మోర్చా మహధర్నాకు ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె బాస్కర్‌రాజు, నందనం దివాకర్‌ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తన స్వార్థ ప్రయోజనాలకోసం రాష్ట్రాన్ని, ప్రజల్ని దోచుకుంటున్న కెసిఆర్‌వల్ల ఇప్పటికీ పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు రావడంలేదని, తెల్ల రేషన్‌కార్డులు లేక భారతప్రభుత్వం అందించే ఆయుశ్మాన్‌భారత్ వంటి పథకాలకు ప్రజలు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వితంతు, వికలాంగుల పింఛన్లతోపాటు అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందాలంటే భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని విజ్ఞప్తిచేశారు. లిక్కర్‌స్కామ్‌లో ఇరుక్కున్న తనబిడ్డను, డిల్లి ముఖ్యమంత్రి కెజ్రీవాల్‌ను కాపాడుకునేందుకు కెసిఆర్ పన్నని కుతంత్రం లేదన్నారు. మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 10వేల పట్టాలను ఇప్పించామని, 45వేల రేషన్‌కార్డులను అందించింది తనేనని గుర్తుచేశారు. ఎతెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్.ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రధాన రహదార్లను సైతం కబ్జాచేసి అమ్ముకున్న టిఆర్ఎస్ నేతలని విమర్శించారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె బాస్కర్, నందనం దివాకర్‌లు మాట్లాడుతూ పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరీ కేవలం తొంబైరోజుల్లో ఇవ్వకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర గిరివర్ధన్‌రెడ్డి, కేశవ్‌యాదవ్, నాయకులు ఎం.ఎస్. శ్రీనివాస్(వాసు), చౌదరిగారి బుచ్చిరెడ్డి, గరిగె శేఖర్, మోటె శ్రీనివాస్‌రావు, గుబ్బల లక్ష్మినారాయణ, ఏర్వ వెంకట్, మహిళా నాయకులు అర్కెల సుధ, నాగమణి పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్**



సమావేశంలో ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బండి రమేష్

గచ్చిబౌలి, మే 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మియాపూర్ రాజారాం కాలనీలో కాలనీ అధ్యక్షుడు షరీఫ్ ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ పాటుపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా రైతుల కోసం రైతుబంధు, దళితుల అభివృద్ధి కోసం దళిత బంధు పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్రానికి నీటి కొరత లేకుండా కాళేశ్వరం వంటి అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టును అకుంటిత దీక్షతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని, నేడు తెలంగాణలోని రైతులు, ప్రజలు కాళేశ్వరం ఫలాలను అందుకుంటున్నారన్నారు. ఐటి రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటిశాఖ మంత్రి కెటిఆర్‌లకు దక్కుతుందన్నారు. నగరంలో శాంతిభద్రతలను పరిర క్షించడంతో పాటు మౌలిక వసతుల మీద ప్రత్యేక ద ృష్టి కేంద్రీకరించి, నగరానికి కోట్లాది రూపాయల పెట్టుబడులను తీసుకువస్తున్న ఘనత బిఆర్ఎస్ పార్టీదన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఐటి సంస్థలతో కూడిన శేరిలింగంపల్లి నియోజకవర్గం మీద ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కోసం వేలకోట్ల నిధులతో పనులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగారెడ్డి, మల్లారెడ్డి, మల్లిఖార్జున్, దేవేందర్‌రావు, సత్తయ్య, ఉమామహేశ్వరరావులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## వివాహిత అనుమానాస్పద మృతి.. వంటిపై గాయాలు



మృతి చెందిన మహిళ

సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త: మూడు నెలల క్రితమే వివాహం జరిగిన మతి స్థిమితం లేని ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా ధర్మారావు పేటకు చెందిన కాసమోని మౌనిక (24) వివాహం మూడు నెలల క్రితం శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తితో జరిగింది. అయితే మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో ఆమెకు ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో చికిత్స జరిపిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆమె మీర్‌పేట్ ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని శివసాయి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న సోదరి వద్ద ఉంటున్నది. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం ఆమె అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో శవమై కనిపించింది. ఆమె శరీరంపై కొన్ని గాయాలు కూడా ఉన్నాయి. అయితే మృతదేహాన్ని గమనించిన స్థానికులు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. మతిస్థిమితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మౌనిక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గతంలో కూడా ఆమె ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. అయితే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువులో ఈతకు వెళ్లి 11ఏళ్ల బాలుడు మృతి

జీడిమెట్ల, మే 29 ప్రభాతవార్త: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్ళిన 11ఏళ్ళ బాలుడి మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విరాల్లోకి వెళితే... ఈనెల 28న మధ్యాహ్నం మనోజ్(11)తన ముగ్గురు స్నేహితులతో కలిసి మైదానంలో కొంత సమయం క్రికెట్ ఆడిన తరువాత చెరువులో ఈత కొట్టడానికి వెళ్ళారు. మనోజ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చినిపోయాడు. అయితే మిగిలిన ముగ్గరు బండరాయి, చెట్ల కొమ్మలను పట్టుకొని ఒడ్డుకు చేరుకున్నారు. మనోజ్ చనిపోయాడనే విషయం ఇంట్లో తెలిస్తే తిడతారనే భయంతో కుక్కలు వెంటపడితే పరుగులు తీశాడని స్నేహితులు అబద్దం చెప్పారు. అయితే మనోజ్ రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో స్థానికులు ముగ్గరుని నిలదీయడంతో తామంతా ఈతకు వెళ్ళామని, మనోజ్ నీటిలో మునిగి చనిపోయాడని జరిగిన విషయం తెలిపారు. అప్పటికే చీకటిపడడంతో మరుసటి రోజు ఉదయం చెరువులో గాలింపు చర్యలు చేపట్టి మనోజ్ మృతదేహన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## బంజారాహిల్స్‌లో కారు బీభత్సం

**ఆగిఉన్న డిసిఎంను ఢీకొట్టి ధ్వంసమైన కారు**

హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త: బంజారాహిల్స్‌లో కారు భీభవత్సం సృష్టించింది. సోమవారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 2లోని రెయిన్‌బో దవాఖ్వాన వద్ద ఆగి ఉన్న డిసిఎం వాహనాన్ని కారు ఢీకొట్టింది. దీంతో అక్కడే ఉన్న సెక్యూరిటి గార్డుతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదం ధాటిఇ కారు నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానాకు తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

## కంటోన్మెంట్ ప్రజలకు నిరంతరం సేవలందిస్తా : శ్రీగణేష్



బోయిన్‌పల్లిలో క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజక వర్గం ప్రజలకు నిరంతరం సేవలందిస్తానని, అదే విధంగా క్రీడాకారులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ బోయిన్‌పల్లి చౌరస్తాలోని ఇండోర్ స్టేడియంలో శ్రీగణేష్ పౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మోను లెవన్ జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, సనత్ నగర్ లెవన్ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు, శ్రీగణేస్ పౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్‌పిఎస్‌సి గ్రూప్-1 ప్రిలీమ్స్‌పై ఉచిత మాక్ టెస్టులు

చిక్కడపల్లి, మే 29 ప్రభాతవార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించబోయే గ్రూప్-1 ప్రిలీమ్స్‌పై మూడు ఉచిత మాక్‌పరీక్షలను జూన్ 1,4,7వ తేదీలలో నిర్వహించబోతున్నట్లు అమిగోస్ ట్వెంటీఫస్ట్ సెంచరీ ఐఎస్ అకాడమి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌లో అకాడమి సెమినార్ హాల్‌లో 3 ఉచిత గ్రాండ్ మాక్‌టెస్టులు నిర్వహిస్తున్నామని, ప్రిలీమ్స్ పరీక్ష ఇప్పటికే ఒకసారి వాయిదాపడిన నేపథ్యంలో అభ్యర్థులకు మానసికక స్థైర్యం నింపి, వారిలో ఆత్మవిశ్వాసం పెరగాలనే సంకల్పంతో సామాజిక బాధ్యతగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని పరీక్షలకు హాజరయ్యే వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో 'కంటి వెలుగు'



ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆర్టీవో ఆర్టీఓ రాంచందర్

హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త : ఖైరతాబాద్ రవాణా కార్యాలయంలో 'కంటి వెలుగు' కార్యక్రమం జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆర్టీఓ రాంచందర్ పర్యవేక్షించారు. ఈ కంటి వెలుగు కార్యక్రమంలో ఖైరతాబాద్ రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, కార్యాలయానికి వచ్చిన వాహనదారులు ఈ కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు.

## పేద వర్గాలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే కాలేరు



లబ్ధిదారులకు ఎల్‌ఓసి పత్రాన్ని అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త : పేద వర్గాలకు వరంలా సిఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతున్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోల్నాక డివిజన్, కమలా నగర్‌కు చెందిన పి.లక్ష్మీ కుటుంబ సభ్యులకు సోమవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక లక్ష ఎల్‌ఓసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉండి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇది రాజకీయాలకు అతీతంగా అందిస్తామని చెప్పారు.

## పాతబస్తీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎంఐఎం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్

చార్మినార్, మే 29 ప్రభాతవార్త : పాతబస్తీ అభివృద్ధి కోసం ఎంఐఎం నిరంతరం కృషి చేస్తున్నదని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.చార్మినార్ నియోజకవర్గం పరిధిలోని పురానాపూల్ డివిజన్‌లో సోమవారం మూడు కోట్ల ఏడు లక్షల రూపాయల విలువ గల పలు అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపనలు చేశారు.ఈ సందరబ ంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీ ప్రజలకు అవసరమైన వసతుల కల్పన కోసం ఎంఐఎం పాటు పడుతున్నదని తెలిపారు.చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్,పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్,ఎంఐఎం నాయకులు రాజు, శ్రీనుతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జివో నెంబర్లు 58, 59 ప్రకారం ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం విఫలం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా ఆరోపణ**




సమావేశంలో ప్రసంగిస్తున్న ఇ.టి.నర్సింహ్మా

సైఫాబాద్, మే 29 ప్రభాతవార్త: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని, ఇళ్ళు నిర్మించుకుని జీవిస్తున్న పేదలకు జివొ నెంబర్లు 58, 59 ప్రకారం ఇళ్ళ స్థలాలు క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వ అధికారులు నిర క్ష్యం వహిస్తున్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా ఆరోపించారు. నిరుపేదల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు మురికివాడలకు అధికారులు వెంటనే వెళ్ళి పరిశీలించి అక్కడే ఇళ్ళ పట్టాలు పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్‌కు తాగునీటి వనరులైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులు, వాటి పరివాహక ప్రాంతాలను జివొ నెంబరు 111 రక్షిస్తుందని, ఈ జివొ రద్దుతో వర్షాలు కురిసే సమయంలో భారీగా నీరు పొంగిపొర్లు తుందని దీంతో హైదరాబాద్ నగరానికి వరద ముంపు ఏర్పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జివొ 111 రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు తీర్చడంతోపాటు అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందన్నారు. మురికివాడల ప్రజలకు కనీస సౌకర్యాలు లభించక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. నిర్మాణాలు పూర్తైన డబుల్ బెడ్‌రూంలను పంపిణి చేయాలని, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో డబుల్ బెడ్‌రూంలు నిర్మించాలని, ప్రజలకు ప్రాథమిక అవసరాలైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీలు, బస్తీల్లో, మురికివాడల్లో పార్టీ శ్రేణులు పాదయాత్రలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, నాయకులు బి.వెంకటేశం, స్టాలిన్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఐకేపీ వివోఏల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటియూ నాయకుల డిమాండ్**



ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీఐటియూ నేతలు

ధర్నాచౌక్, మే 29, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఐకేపీ వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు పాలడుగు భాస్కర్, జే.వెంకటేష్, పద్మ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఐకేపీ విఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ రాష్ట్ర కమిటీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో (ఐకేపీ) గ్రామ సంఘాల సహాయకులు (విఓఏ లు) దాదాపు 17 వేలకు పైగాగత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, కనీస సౌకర్యాలు అమలుకావటం లేదని తెలిపారు. తక్షణమే ఐకేపీ విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదిలక్షల రూపాయల ఆరోగ్య భీమా, సాధారణ భీమా సౌకర్యాలు కలల్పించాలని, ఎస్.హెచ్.జి సభ్యులకు ఐదు లక్షల భీమా కల్పించాలని కోరారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు ఐఓఏల వ్యక్తిగత ఖాలతాలకు చెల్లించాలని, జాబ్ చార్ట్‌తో సంబంధం లేని పనులను చేయించరాదని, ప్రతి ఒక్కరికీ సెర్ప్‌నుండి ఐడి కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన విఓఏలను సిసిలుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐకేపి విఓఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నగేష్‌తో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

## ఈ దఫా రాజేంద్రనగర్‌ను 'హస్త'గతం చేసుకొని తీరుతాం

**పిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గంను ప్రకటిస్తున్న పిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నార్సింగి, మే 29 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈ దఫా రాజేంద్రనగర్‌ను "హస్త"గతం చేసుకొని తీరుతామని పీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యుల పేర్లను స్వయంగా జ్ఞానేశ్వర్ చదివి వినిపించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేఖ పాలనలే ఆ పార్టీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బొంద పెడుతాయన్నారు. కర్నాటక ఫలితాలే తెలంగాణలో వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలన పట్ల విసుగెత్తి పోయారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయా? ఎప్పుడు కాంగ్రెస్‌కు అధికారంను అప్పగిద్దామా అని ఎదిరి చూస్తున్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఏ గడపకు వెళ్లినా ప్రజలు పూటకో హామీనిచ్చి మాట మారుస్తున్న కేసీఆర్ పట్ల తీవ్ర వ్యతిరేఖతను వ్యక్తం చేస్తున్నారన్నారు. రూ.లక్ష ఋణమాఫీని ఇప్పటివరకు చెల్లించలేదన్నారు.

**నూతన కార్యవర్గం..** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పూలపల్లి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా తలారి ప్రేమ్ కుమార్, అధ్నాన్ సిద్దిఖీ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సభ్యులుగా విష్ణు, అంజయ్య యాదవ్, బాల్‌రాజ్, రాంచందర్, గోపాల్, బీసీ సెల్ అధ్యక్షులుగా అంకం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్, రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్‌లు ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పిఎస్.కుమార్, ఉపాధ్యక్షులుగా మధుసూదన్, బాబురావ్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ మైనార్టీసెల్ అధ్యక్షులుగా మహ్మద్ అయూబ్‌ఖాన్, షేక్ మక్బుల్, షేక్ మదర్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా ఇషాక్‌లు నియమితులయ్యారు.

## మాలలను ఐక్యం చేసేందుకే జేపీసీ ఆవిర్భావం

**మాల సంఘాల జేపీసీ చైర్మన్ చెరుకు రాంచందర్**



సమావేశం అభివాదం చైర్మన్ రాంచందర్, బత్తుల రాంప్రసాద్, వినోద్ కుమార్

హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర అవిర్భావం నుంచి నేటి వరకు మాలలకు జరుగుతున్న అన్యాయాలను, అవమానాలు ఎదర్కొనడానికి రాష్ట్రంలోని సంఘాలన్నింటిని ఐక్యం చేసి సమస్యలు పరిష్కరించుకునేందుకే మాలసంఘాల జేపీసీ ఆర్భివించినది జేపీసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జేపీసీ పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేసి ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలంతో పని చేస్తున్న సంఘాలు, మాలలను సామాజిక,ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి 32 సంఘాలతో సుదీర్ఘ చర్చల అనంతరం పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెండు మూడురోజుల్లో విస్తత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

**జేపీసీ పూర్తిస్థాయి కమిటీ..** చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ బత్తుల రాంప్రసాద్, గుడిమల్ల వినోద్‌కుమార్, తాళ్లపల్లి రవి, కన్వీనర్ - నల్లాల కనకరాజు, ఛీఫ్ కోర్డినేటర్‌లుగా మందాల భాస్కర్, విజయ్‌కుమార్, కోచైర్మన్లుగా గడ్డం సత్యనారాయణ, కె.గిరెందర్‌మాల, మంత్రి నర్సింహ్మా, బరిగెల వెంకటస్వామి, పి.బల్వత్‌రావు, నిమ్మబాబురావు, బరిగెల వెంకటస్వామి,పబ్బతి వెంకటస్వామి, ఈగల రాములు, తాటి కుమార్, బేర బాలకిషన్,గోపాల్, మేకల సత్యనారాయణ, మస్తా దయానంద్, నేపూరి ప్రణయ్, కో.కన్వీనర్లుగా టి.అనిల్, ఉత్తం శ్రీనివాస్, ముత్యం గాభూషణ్, శ్యామ్ కుమార్, తుమ్మ శ్రీనివాస్, కొప్పుల మధు, గాజుల పున్నయ్య, అడ్వయిజర్లుగా ..జి.శంకర్, రావుల అంజయ్య, రాజు ఉస్తాద్, ఎర్రమల్ల రాములు, ప్రేమ్‌కుమార్, యాదగిరి ,నల్లపు వెంకటేశ్వర్లను ప్రకటించారు.

## కరాటే కల్యాణిపై మా సస్పెన్షన్ ఎత్తివేయాలి

**యాదవ, హిందూ సంఘాల డిమాండ్**

హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త: మానవులను దేవుడి రూపంలో విగ్రహం పెట్టడం సమంజసం కాదని మాట్లాడినందుకు కరాటే కళ్యాణిపై మా అసోసియేషన్ సస్పెండ్ వేటు వేయడం సమంజసం కాదని ...ఆమెపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని పలు యాదవ, హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరాటే కళ్యాణితోపాటు, భారత యాదవ సమితి, రాష్ట్రీయ శివాజీ సేన, యాదవ విద్యావంతుల వేదిక, విశ్వహిందూ పరిషత్, యాదవహక్కుల పోరాట సమితి , హైందవ సైతన్యంతోపాటు పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే కళ్యాణి మహిళ , బడుగు బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి కాబట్టే మా అసోసియేషన్ ఈచర్యలకు పాల్పడిందన్నారు. ఎందుకు సస్పెండ్ చేస్తున్నారో చెప్పకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటమేంటని ప్రశ్నించారు. మా అసోసియేషన్ పునరాలోచించి ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేయాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



మణికొండ మున్సిపాలిటీలోని పార్కుల్లో తాగునీటి చల్లటి తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్

## మణికొండ పార్కుల్లో తాగునీటి కుళాయిలు ప్రారంభం

నార్సింగి, మే 29 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పార్కులలో చల్లటి తాగునీటి కుళాయిలను సోమవారం చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 4.వ,వార్డులో ఉన్న చాచా నెహ్రూ పార్కు, ఆరో వార్డులోని హ్యాపీ హోమ్స్ పార్కులో 350.లీటర్ల సామర్థ్యమున్న రెండు కుళాయిలను వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమీషనర్ ఫల్గుణ్ కుమార్‌లతో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం భరించలేకపోతున్నామన్నారు. ఉదయం 8.గంటల నుంచి సాయంత్రం 6.గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. పార్కులకు వాకింగ్‌కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ నీటి కుళాయిలు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, మీన ముత్యాలు, వందన నాగేష్, కో ఆప్షన్ సభ్యులు లక్ష్మీ, తాజుద్దీన్, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫంకజ్ కుమార్‌కు అవార్డు ప్రధానం



ఫంకజ్ కుమార్ అగర్వాల్ అవార్డు అందుకుంటున్న దృశ్యం

చార్మినార్, మే 29 ప్రభాతవార్త : పాతబస్తీ గుల్జారా హౌస్ ప్రాంతానికి చెందిన సంఘ సేవకులు అశోక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఫంకజ్ కుమార్ అగర్వాల్‌కు ఎన్‌టిఆర్ లెజెండరీ జాతీయ అవార్డు లభించింది.మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతి సదర్భంగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా,తెలుగు సినీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో జరిగిన కార ్యక్రమంలో ఫంకజ్ కుమార్ అగర్వాల్‌కు ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు చైతన్య జంగ్‌తో పాటు పలువురు కలిసి ఎన్‌టిఆర్ లెజెండరీ అవార్డు 2023ను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమం లో పి.వర్మ, ప్రియాంక అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడే దాసరి-వంశీ పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, మే 29 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతి, సాహిత్య, సామాజిక సేవాసంస్థ వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఫిలింనగర్ హైదరాబాద్‌లోని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి వేదికలో ఈరోజు 30 మంగళవారం సాయంత్రం 4గంటల నుండి దాసరి-వంశీ పురస్కారాల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ, శిరోమణి డా. వంశీ రామరాజు మీడియాకు తెలియజేశారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, సినీవిరాట్ తుమ్మలపల్లి రామసత్యనారాయణ నేతృత్వంలోని కమిటీ దాసరి-వంశీ వివిధ పురస్కారాలకు అర్హులైన ప్రముఖులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న ప్రముఖ సినీనటుడు, నిర్మాత, మాజీ పార్లమెంటు సభ్యుడు ఎం.మురళీమోహన్, విశిష్ట అతిథులు సినీనటుడు దాసరి అరుణ్‌కుమార్, సినీనిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, బొల్లినేని కృష్ణయ్య, సినీనిర్మాత సి.కళ్యాణ్, సినీగేయ రచయిత, జాతీయకవి డా. సుద్దాల అశోక్‌తేజ, వంశీ సంస్థల అధిపతి డా. వంశీరామరాజు, ప్రముఖ సంఖ్యాశాస్త్రజ్ఞుడు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, చలనచిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ తదితరులతో కలిసి ప్రజాగాయకుడు గద్దర్‌ను దాసరి-వంశీ జీవితసాఫల్య పురస్కారం; వార్త తెలుగు జాతీయ దినపత్రిక సంపాదకులు దామెర్ల సాయిబాబాకు దాసరి-వంశీ విశిష్ట పురస్కారం; ఆంధ్రపత్రిక మేనేజింగ్ ఎడిటర్ శర్మకు దాసరి-వంశీ విశిష్ట పురస్కారం; దాసరి-వంశీ ప్రతిభా పురస్కారాలను సుమన్, డా. లక్ష్మీప్రసాద్ కలపటపు, నంగునూరి చంద్రశేఖర్, నటుడు సంజీవి, దర్శకుడు ప్రభు, రచయిత వినాయకరావు, సంజయ్‌కిషోర్, పొత్తూరి రంగారావు, ఎల్.వి.చెన్నారావు, విరాజ్‌వర్మ, సురేందర్ ప్రదానం చేయనున్నట్లు వంశీరామరాజు పేర్కొన్నారు. సభకుముందు నవసర గాయని, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆయని, సుభాష్, రాజన్, ఎన్.శిరీష తదితర వర్ధమాన గాయకులచే ఆణిముత్యాల్లాంటి చలనచిత్ర గీతాల సినీసంగీత విభావరి ఉంటుందని ఆయన తెలిపారు.

## మహిళా రెజ్లర్లపై బలప్రయోగం.. మానవహక్కుల ఉల్లంఘన

**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, కోట నీలిమ**

హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త: తమకు న్యాయం చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లపై క్రూరమైన బలప్రయోగం చేసి నిర్భందించడం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం తన కార్యాలయం నుంచి ఓప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ పాలనలో భారతదేశం మహిళలకు అత్యంత ప్రామాదకరంగా మారిందన్నారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరన్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని శాంతి యుతంగా ప్రదన్శన చేస్తుంటే ఉద్యమకారులపై దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ క్రీర్తిని నిలబెడుతున్న రెజ్లర్లకు మోదీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రెజ్లర్లను పోలీసులతో బలవంతంగా వ్యాన్‌లలోకి తీసుకెళ్లడం వంటి అత్యంత హృదయవిదారకరమైన దృశ్యాలు చూసి మోదీ నియంతృత్వ పాలనా, అప్రజాస్వామిక సంస్కృతి అసలు రూపం బయటపడిందని తెలిపారు.

## విదేశాల్లోనూ కరాటే విద్యార్థులు సత్తా చాటాలి



బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే కోచ్ దామోదర్‌నాయక్ తదితరులు

హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త : కరాటే విద్యార్థులు విదేశాల్లోనూ సత్తా చాటాలని ప్రముఖ కరాటే శిక్షకులు దామోదర్‌నాయక్ అన్నారు. కర్మన్‌ఘాట్‌లో జరిగిన నేషనల్ లెవల్ చాంఫియన్‌షిప్ కరాటే, కుంఫూ పోటీలను నిర్వహించగా, కాచిగూడకు చెందిన కర్ణాటక సాహిత్య మందిర్, హెల్ప్ లీగ్ కరాటే విద్యార్థులు రెండు బంగారు పతకాలు, రెండు రజితం, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ దామోదర్‌నాయక్, కరాటే కుంఫూ పోటీల్లో గెలుపొందిన కాచిగూడ కర్ణాటక సాహిత్య మందిర్, హెల్ప్‌లీగ్ కరాటే విద్యార్థులను సోమవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందితే ఆత్మస్థైర్యంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని చెప్పారు. చదువుతో పాటు విద్యార్థులు కరాటేను అభ్యసించడం ఎంతో అవసరమని, ఆత్మరక్షణకు కరాటే ఓ ఆయుధంగా పనిచేస్తుందన్నారు.

## తుంటియా నూతన కార్యవర్గం ఎన్నిక




మాట్లాడుతున్న అధ్యక్షులు జ్ఞానేశ్వర్

తార్నాక, మే 29 ప్రభాతవార్త: తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (తుంటియా) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన జర్నల్ బాడీ మీటింగ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తుంటియా నూతన అధ్యక్షులుగా ఓ.యూ ఎన్జీవోస్ అధ్యక్షులుగా బియాని జ్ఞానేశ్వర్‌ను ఎన్నికుకున్నారు. అదేవిదంగా గౌరవ అధ్యక్షులుగా మహేష్ గౌడ్, సెక్రెటరీ జర్నల్‌గా అమృత రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.తిరుపతి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా లఖావత్ యాదగిరితో పాటు మరో 30 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తుంటియా నూతన అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 14 యూనివర్సిటీల ల్లో పనిచేసే భోదనేతర సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ద్వార కృషి చేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి రవి, టెక్నికల్ స్టాఫ్ అసోషియేషన్ అధ్యక్షులు నాగరాజారావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఎంప్లాయిస్ యూని యన్ అధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి అక్బర్ బేగ్, నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు సూర్యచందర్, కట్ట వెంకటేష్, చేర్యాల శ్రీనివాస్, కె.శ్రీకాంత్, ఎడ్ల అంజయ్య, వీరేషం తధితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

## దళితబంధు అమలులో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదు

**తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్ద యాదయ్య మాదిగ**




ప్రసంగిస్తున్న తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్ద యాదయ్య మాదిగ

చిక్కడపల్లి, మే 29 ప్రభాతవార్త: దళితబంధు పథకం అమలులో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని, లబ్దిదారులకు రావాల్సిన నగదును వెంటనే ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకునే విధంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్ద యాదయ్య మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం(టిఎంఎస్‌ఎస్) ఆధ్వర్యంలో 'దళిత బంధు పథకం' అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాలమాదిగ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏకు తిరుపతి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాలయ్య, అమరవీరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాల యాదయ్య, సంఘం రాష్రష్ట ఉపాధ్యక్షులు చింతల రాము, గజ్జెల సూర్యనారాయ, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు గజ్జెల సంపూర్ణ, గోర్ల సరస్వతి, కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గద్ద యాదయ్య మాదిగ మాట్లాడుతూ దళితులు తమ డబ్బును ప్రభుత్వం నుంచి పొందాలని ఆసక్తి ఎందుకు ఉండడం లేదని, అనేక ఉద్యమాలకు, అనేక రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం తమ ఆట, పాట, మాటలతో ఉత్తేజపంరిచే సామాజిక ఉద్యమకారులు, కవి, గాయక కళాకారులు తెలంగాణ ఉద్యమ ఫలితాలను పొందాలనే ఆలోచన ఎందుకు లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

## సంజార జాతుల అభివృద్ధే లక్ష్యంగా జాతీయ కోర్డినేషన్ కమిటీ

**తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షులు ఓ.నరేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్, శ్రీనివాస్

హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త: సంజార జాతుల అభివృద్ధే లక్ష్యంగా జాతీయ కోర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేశామని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షులు ఓ.నరేందర్ అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంచార జాతుల సంక్షేమం కోసం 2006లో బాలకృష్ణ రేనాకే డిఎన్‌టి జాతీయ కమిషన్ వేశారని దీని నివేదిక 2008లో అప్పటి కేంద్రప్రభుత్వానికి నివేదించారన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం కూడా 2015లో కమిషన్ వేయగా 2018లో నివేదిక సమర్పించిందని,కానీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం జరగలేదన్నారు. సంచార జాతులపై కేంద్రప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ఇందులో రూపొందించిన హైదరాబాద్ డిక్లరేషన్‌కు బిజెపి జాతీయ నాయకులు,ఎంపి డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, తెలంగాణ మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, కాంగ్రేస్ పార్టీ జాతీయ కోర్డినేటర్ కొప్పుల రాజు చేతులమీదుగా ఆవిష్కరించామన్నారు. దీనికి అచరణలోకి తీసుకువచ్చేందుకు జాతీయ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన కార్యదర్శి అపిరిశెట్టి శ్రీనివాస్, స్పోక్‌పర్సన్ వెన్నెల నాగరాజు, యువజన సంఘం అధ్యక్షులు బి.యువరాజు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం బెల్ట్‌షాపులను తొలగించాలని మంత్రులకు వినతి: బద్దం కొండల్‌రెడ్డి

శేరిలింగంపల్లి, మే29 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో వెలసిన గల్లికో బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలని పాపిరెడ్డినగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి రాష్ట్ర పురపాలక,ఐటీ శాఖా మంత్రి కేటీఆర్,రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్,స్థానిక ఎక్సైజ్ సీఐ లకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ పాపిరెడ్డినగర్‌కాలనీ ఆంజనేయస్వామి దేవాలయం పక్కన, గోపిచెరువు సమీపంలో,సందయ్యనగర్, రెడ్‌బిల్డింగ్స్ తదితర ప్రాంతాలలో అక్రమ మద్యం బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి రాత్రి,పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు స్థానిక పోలీసులు లంచాలు తీసుకుని సహకరిస్తున్నారని ఆరోపించారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మే 29 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్‌లో గతంలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందని ఇందులో భాగంగా సోమవారం సుమారు కోటి ఎనభై అయిదు లక్షల ఎనభై వేల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఎల్‌బినగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. సద్గురునగర్ రోడ్డు నంబర్ 1, 2 వద్ద సీ.సీ.రోడ్డు, వనస్థలిపురంలోని కాంప్లెక్స్ ఏరియాలోని ప్లాట్ నం. -202 నుండి ప్లాట్ నం. 196 (జడ్పీహెచ్ వనస్థలిపురం పక్కన) వరకు సీ.సీ.రోడ్డు, హస్తినాపురం ఈస్ట్‌కాలనీ మెయిన్ రోడ్డు వద్ద సిగ్నల్‌నుండి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు, పిఎల్‌నెం.64 నుండి కమ్యూనిటీ హాల్ వరకు, పిఎల్‌నెం.102 నుండి పిఎల్‌నెం.94/ఎ పిఎల్‌నెం వరకు సి.సి.రోడ్డు, శ్రీ శ్రీనివాసపురం రోడ్డు నెంబర్ 11 వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న బీ.టీ.రోడ్లకు మరమ్మతులు, పద్మావతి కాలనీ బస్టాప్ నుండి ఆర్టీసి కాలనీ జంక్షన్ వరకు, అభ్యుదయనగర్ కాలనీ వద్ద బాగా దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరించడం పనులకూాయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రజలకు కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలు అధికారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్‌గుప్తా, ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారాస యువజన నాయకులు ముద్ద కళ్యాణ్, కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, గడ్డం మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సంజయ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 5వ తేదీ నుండి శ్రీ వీర వెంకట సత్య నారాయణస్వామి వారి బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, మే 29 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ లలితానగర్ కాలనీలోని శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామి దేవాలయం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు దేవాలయం చైర్మన్ ఊర నరసింహగుప్తా తెలిపారు. బ్రహ్మోత్సవాలు జూన్ 5వతేదీ నుంచి 10వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజపటాధివాసం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, గరుడ ప్రసాదము, హోమము, ద్వజారోహణము, మూల మంత్ర హోమము, పూర్ణాహుతి, నిత్య హోమములు, లక్ష పుష్పార్చన, శ్రీరమా సహిత శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి వారి కళ్యాణ మహోత్సవం, వ్రతము, ప్రధాన కుంభారాధన, మహా పూర్ణాహుతి, శేష వాహనము, గరుడవాహన సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఆరవ తేదీ గరుడ ఇష్టి, 7వ తేదీన సుదర్శన ఇష్టి, 8వ తేదీన లక్ష్మీనారాయణ ఇష్టి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తామని తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బండచెరువు సుందరీకరణకు తగిన చర్యలు : ఎమ్మెల్యే మైనంపల్లి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హన్మంతరావు, ఇతర అధికారులు

**మల్కాజిగిరి, మే 29 ప్రభాతవార్త :** జూన్ 2నుండి 22వ తేదీవరకు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సావాల సందర్భంగా ఆనంద్‌భాగ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసి కాలని బండ చెరువును ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. బండ చెరువు సుందరీకరణకు తగిన చర్యలు తీసుకుంటామని, చెరువు కబ్జా చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీత రాముయాదవ్, మీనాఉపేందర్‌రెడ్డి, జితేంద్రనాథ్, అనిల్, కిషోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, అధికార ప్రతినిధి సతిష్‌కుమార్, సర్కిల్ అధ్యక్షుడు పిట్లశ్రీనివాస్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, రాముయాదవ్, ఉపేందర్‌రెడ్డి, ఎస్ఆర్.ప్రసాద్, బాబు, సత్యనారాయణ, సంతోష్, రాందాస్, కన్నా, డీఈ మహేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తరగతుల వారిగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామర్థ్యాన్ని అందించాలి : బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఎం వి ఫౌండేషన్

**మల్కాజిగిరి, మే 29 ప్రభాతవార్త :** బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఎం వి ఫౌండేషన్ ప్రతినిధులు తరగతి వారిగా విద్యా సామర్థ్యాన్ని అందించాలని పేర్కొన్నారు. సోమవారం మల్కాజిగిరి మండలం షఫీనగర్ ఆర్టీసి కాలనీలో తల్లుల సంఘం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో రోజురోజుకు విద్యా సామర్థ్యాలు తగ్గుతున్నాయని, తరగతివారీగా విద్యా సామర్థ్యాన్ని పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందని, మండల పరిధిలో 68 మంది పిల్లలు బడికి దూరమై బాల కార్మికులుగా పనిచేస్తున్నారని వారు హక్కులను కోల్పోతున్నారన్నారని వారిని ఆదరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.సాయిలక్ష్మి, జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ బి.భాగ్యరాణి, ఎస్ రాధా, ఎం.వి ఫౌండేషన్ ఆర్గనైజర్లు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలు



సుమన్‌గౌడ్‌ను అభినందిస్తున్న లింగాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**మలక్‌పేట, మే 29 ప్రభాతవార్త :** యువతకు విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎడుగైడ్ ఓవర్‌సీస్ స్టడీస్ నిర్వాహకులు సుమన్‌గౌడ్ పేర్కొన్నారు. మూసారాంబాగ్ సంస్థ కార్యాలయంలో విద్య, ఉపాధి అవకాశాల గురించి కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా మలక్‌పేట మైత్రికన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఎల్‌బినగర్ బిజెపి ఇంఛార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రంగ నర్సింహ్మగుప్త, ప్రేమ్ మహేందర్‌రెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకుడు బొక్క మధుసూదన్ రెడ్డి తదితరులు విచ్చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమసంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఐటి రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. తమ సంస్థ ద్వారా యుఎస్ఎ, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలలో ఉన్నత చదువుకోసం పంపించడం జరగుతుందని, విద్య పూర్తయిన తర్వాత జాబ్ ఇప్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 600ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోపాటు సమాజానికి తమవంతు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, ప్రీతి, ప్రశాంత్, ప్రతిభ, సందీప్, ప్రత్యూష, రాజీవ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత : విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మైనారిటీ యువకులు

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమానికి కూడా ప్రాధాన్యతనిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు మైనారిటీ యువకులు సోమవారం సీనియర్ మైనారిటీ నాయకుడు ఎంఎ హుస్సేన్ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం వివిధ పార్టీలకు చెందిన మైనారిటీ యువకులు ఇబ్రహీం, అబ్దుల్ అజీజ్, గఫార్, ఖురేషి తదితరులు సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి పార్టీ కండువాలు వేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని మైనారిటీ ప్రాంతాల అభివృద్ధికి అదే విధంగా వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. షాదీ ముబారక్ పథకం ద్వారా వేలాది మందికి ఆర్థిక సాయం అందించామని గుర్తు చేశారు.

## కల్వర్టు పనులను వేగంగా పూర్తిచేయాలి

**హయత్‌నగర్, మే 29 ప్రభాతవార్త :** వర్షాకాలం ఆరంభం కానున్న నేపథ్యంలో కల్వర్టు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హయత్‌నగర్‌నుంచి మునుగనూర్ వెళ్లేదారిలో కొనసాగుతున్న కల్వర్టు పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు పనులు ఆలస్యం అయితే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ, నాయకులు గంగాని శ్రీను పాల్గొన్నారు.

## 75 లక్షలతో నూతన కార్పొరేషన్ భవన నిర్మాణానికి తీర్మానించిన కౌన్సిల్

**జవహర్‌నగర్, మే 29, ప్రభాతవార్త :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మేయర్ మేకల కావ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాలకు, అధికారుల కార్యకలాపాలకు సరిపోనందున నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు 75 లక్షల రూపాయలను టీయూఎఫ్ ఐడిసి నిధుల నుండి చెల్లించుటకు కౌన్సిల్ తీర్మానించింది. కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న ఓపెన్ నాలపై స్లాబ్ నిర్మించేందుకు ఐదు లక్షల రూపాయల మున్సిపల్ సాధారణ నిధులు చెల్లించేందుకు తీర్మానించారు. అలాగే వికలాంగుల కాలనీలోని బస్తీ దవాఖాన వద్ద మూడు లక్షలతో వాటర్ సంప్ నిర్మాణం చేపట్టాలని, 5 లక్షల రూపాయల నిధులతో కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లో సమస్యలు ఉన్న మ్యాన్ హోల్ల మరమ్మతులు చేపట్టాలని తీర్మానించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న దశాబ్ది వేడుకలు ఉత్సవాలను 15 లక్షల రూపాయల నిధులతో వివిధ కార్యక్రమాలు చేపట్టి ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామలింగం, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల పరిశీలన : లచ్చిరెడ్డి



కాలనీ అభివృద్ధికి అహర్నిశలు కృషి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, మే 29 ప్రభాతవార్త :** బియన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్2లో జరుగుతున్న సిసి రోడ్ పనులను డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిహెచ్ఎంసి ఎఇ దామోదరరావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులను నిర్వహించాలని, కాలనీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని, త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పివిబిడి శర్మ, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సుబ్బారావు, పార్టీ డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, పవన్‌రెడ్డి, జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జే.డి ఫౌండేషన్ అధ్వర్యంలో దివ్యాంగురాలికి చిరు వ్యాపారం

**నేరెడ్‌మెట్, మే 29 ప్రభాతవార్త :** స్వశక్తితో నిలబడి ఎవరిమీద అధార పడకుండా జీవనోపాధిని పొందాలని జే.డి ఫౌండేషన్ కన్వీనర్ మురళి మోహన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నేరెడ్‌మెట్ జేజే నగర్‌కు చెందిన ఓ దివ్యాంగురాలికి జే.డి ఫౌండేషన్ అధ్వర్యంలో పూజా సామాగ్రి వ్యాపారాన్ని ఏర్పాటు చేయించారు. ఈ దుకాణాన్ని నేరెడ్‌మెట్ ఎస్సై సి.హెచ్ శ్రీరాములు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పూజా సామాగ్రి షాపు, పూల షాపుకు ఫిలాడెల్ఫియా అనే స్వచ్ఛంద సంస్థ అర్థిక సహకారం అందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. సమాజంలో దివ్యాంగులకు పలు స్వచ్ఛంద సంస్థలు అర్థిక సహాకారం అందించి అర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్, ఎక్స్‌టమైల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగమోహన్, అఫ్తా, శ్రీకాంత్, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




## పట్టించుకోని ఉన్నతాధికారులు - ఎసిబికి పట్టుబడ్డ మారని వైనం

**ఎల్.బి.నగర్, మే 29 ప్రభాతవార్త :** అంతా మేం చూసుకుంటా మీరేమీ పట్టించుకోవద్దంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు భరోసా ఇస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో జిహెచ్ఎంసి ఆదాయానికి పెద్దఎత్తున గండిపడుతోంది. స్థానికులు అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఎన్ని ఫిర్యాదులు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోగా వారికి భరోసా ఇవ్వడంతో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. సరూర్‌నగర్ సర్కిల్ పరిధి కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, ఆర్కేపురం, సరూర్నగర్ డివిజన్ల పరిధిలో జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు చేతివాటానికి అలవాటు పడడంతోనే అక్రమ నిర్మాణాల జోరు పెరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. అవినీతిఆరోపణలు రావడంతో గతంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి టౌన్‌ప్లానింగ్ విభాగంలోని వారిని పట్టుకున్నారు. అయినప్పటికీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందిలో ఎటువంటి మార్పు రావడంలేదని పలువురు అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి కారణంగా జిహెచ్ఎంసి కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతుంది. అవినీతి అధికారుల భరతం పట్టకపోతే పరిస్థితి మరింత దయానియంగా మారే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవినీతి అధికారుల భరతం పట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విప్ర సేవా సదన్ నిర్మాణ ఘనత కెసిఆర్‌దే: మంగు రాఘవరావు



సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నాయకులు

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో బ్రాహ్మణులకోసం ప్రత్యేకంగా విప్ర సేవా సదన్‌ను నిర్మించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు మంగు రాఘవరావు అన్నారు. శేరిలింగంపల్లిలోని గోపనపల్లిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విప్ర సేవా సదన్‌ను ఈ నెల 31వ తేదీ బుధవారం సిఎం కెసిఆర్ బ్రాహ్మణ జాతికి అంకితం చేస్తున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మహేశ్వరం బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మంగు రాఘవరావు మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తున్న సిఎం కెసిఆర్‌కు బ్రాహ్మణ సమాజం రుణపడి ఉంటుందని అన్నారు. బుధవారం జరిగే విప్ర సేవా సదన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నియోజకవర్గ బ్రాహ్మణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు మురుకుంట్ల అరవింద శర్మ, కోటారు ప్రమోద్‌కుమార్, భాస్కర శర్మ, చక్రవర్తుల జగన్మోహనాచార్యులు అక్కినేపల్లి వెంకటేశ్వరరావు, నండూరి ప్రకాష్ రంగరాజు, యాదగిరిరావు, మటుకుల మధుసూదనరావు, శ్రీనివాస ప్రసాద్, వెల్దండ బల్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటం ఆపేది లేదు : సిపిఎం నాయకులు



సూపరింటెండెంట్ జ్యోతికి వినతి పత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**తుర్కయంజాల్, మే 29 ప్రభాతవార్త :** సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైన నిరుపేదలందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ జ్యోతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ సిపిఎం మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య విచ్చేసి మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపల్ ప్రాంతంలో అనేక గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేక వేలాది మంది ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ ప్రాంతంలో ఉన్నటువంటి నిరుపేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వం స్పందించని ఎడల ప్రభుత్వ భూములను మేమే గుర్తించి పేదలను సమీకరించి గుడిసెలు వేయిస్తామని, భూములను కబ్జా చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కవిత, ఈ.నరసింహ, నాయకులు సత్యనారాయణ, భాస్కర్, కె.శంకర్, ఆశీర్వాదం, ప్రకాష్‌కారత్, పెంటయ్య ,శంకరయ్య, మాధవరెడ్డి, కే.శారద, రత్నమ్మ, రోజా, రాణి, శివ, ప్రసాద్, నాగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : పున్న గణేష్



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న పున్న గణేష్‌నేత తదితరులు

**ఎల్.బి.నగర్, మే 29 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ దేశానికి, రాష్ట్రానికి అనేక సేవలు అందించి అనేక ప్రజా పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ నుంచి నేటి రాహుల్‌గాంధీ వరకు దేశం కోసం, దేశ ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. రానున్న ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు సామిడి గోపాల్‌రెడ్డి, కందుకురు మండల అధ్యక్షులు కాకి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత విద్యార్థి చికిత్సకు విద్యాశాఖ మంత్రి సాయం

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదానికి గురైన ఓ విద్యార్థి వైద్య చికిత్సకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఎల్‌ఓసి మంజూరు చేయించి ఆదుకున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 24వ డివిజన్‌కు చెందిన కిరాణా షాపు నడుపుకునే పేద కుటుంబానికి చెందిన భరత్ అనే విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురై నిమ్స్‌లో చేరాడు. అయితే స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి సహకారంతో కుటుంబ సభ్యులు మంత్రిని ఆశ్రయించగా ఆమె ఎల్‌ఓసి మంజూరు చేయించి అందజేశారు. ఈ మేరకు భరత్ కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## మల్కాజిగిరి జిల్లా నూతన కోర్టు నిర్మాణ పనుల పరిశీలన : ఎమ్మెల్యే మైనంపల్లి



మల్కాజిగిరి కోర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

**నేరెడ్‌మెట్, మే 29 ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టును వినాయక్‌నగర్ డైట్ కళాశాలకు తరలించిన విషయం విదతమే. దాంట్లో భాగంగా రూ. 90కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న మల్కాజిగిరి నూతన కోర్టు బిల్డింగ్ పనులను సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మల్కాజిగిరి కోర్టు భవన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి బిల్డింగ్ పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జిఎన్‌వి సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, రాము యాదవ్, పార్థసారది, అగమయ్య, సైతులు, అధ్యక్షులు కోటా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : బలాల



చావుని డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, మే 29 ప్రభాతవార్త :** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చావుని డివిజన్‌లోని పలు పాఆంతాల్లో డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల పర్యటించి సీవరేజ్, రోడ్డు తదితర సమస్యల గురించి పరిశీలించారు. అదే విధంగా స్థానిక ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఎమ్మెల్యే బలాల స్పందించి ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. వివిధశాఖల అధికారులతో అభివృద్ధి పనులకు సంబంధించి తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడడానికి ప్రణాళికలను రూపొందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జున్, గోవింద్‌రెడ్డి, నాయకులు అతుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ఆర్‌కెపురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు మంత్రి సబితను ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)